సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

అమ్మవారి చీరల పంపిణీ



వృద్ధురాలికి చీర అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడి కాలనీలోని దానప్పతల్లి గుడిలో అమ్మవారికి వచ్చిన చీరలను శనివారం పేదలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఏడాది మొత్తం మీద అమ్మవారికి వచ్చే చీరలను భోగి రోజు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సరళన దానయ్య, డి.వి.అప్పారావు, బి.అప్పలసత్యం తదితరులు పాల్గొన్నారు.

జీవో నంబర్ 1 ప్రతుల దహనం

గాజువాక: సీపీఐ గాజువాక నాయకులు జీవో నంబర్ 1 ప్రతులను దహనం చేశారు. పార్టీ నాయకుడు కసిరెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక బీసీ రోడ్‌లోని కాకతీయ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన భోగిమంటల్లో ప్రతులను వేసి, తగలబెట్టారు. ఈ జీవోను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పల్లేటి పోలయ్య, జి.ఆనంద్, ఎల్లేటి శ్రీనివాసరావు, కె.అచ్యుతరావు తదితరులు పాలొన్నారు.

వైఎస్సార్ విండ్‌బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విండ్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శనివారం ప్రారంభించారు. 67వ వార్డు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పల్లా సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీలను మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొత్తం 25 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, వివిధ సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు డాక్టర్ పెబ్బిలి రవికుమార్, ఎస్‌ఎండీ గౌస్, చిత్రాడ అప్పారావు, పల్లా పోలిపల్లి తదితరులు పాల్గొన్నారు.

రేపు రాధామాధవ స్వామి పండగ

పెదగంట్యాడ: పాత గంగవరంలో కొలువు దీరిన రాధామాధవస్వామి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా కనుమ పండగ రోజు స్వామి వారి పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 500ఏళ్ల నాటి ఈ ఆలయంలో పూజలు చేస్తే సకల సంపదలతో పాటు కోరిన కోర్కెలు నెరవేరతాయని భక్తుల విశ్వాసం. సముద్ర తీరంలో, కనువిందు చేస్తున్న కొండపై కొలువు దీరిన మాధవస్వామిని దర్శించుకోవడంతో పాటు అక్కడే ఉన్న గొల్లభామ రాయి వద్ద ప్రత్యేక పూజలు చేయనున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అందుకు తగినట్లుగా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

పేదలకు చీరలు, దుప్పట్ల పంపిణీ



పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

పెదగంట్యాడ: సంక్రాంతి పండగను పేదలు కూడా ఆనందంగా జరుపుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు జాన్ డీన్ ఆకాంక్షించారు. సమతానగర్‌లోని రోటరీ క్లినిక్ వద్ద పేదలకు శనివారం చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. క్లబ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్ నుంచి శనివారం రాత్రి బయలుదేరాల్సిన పలు రైళ్లను రీషెడ్యూల్ చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.
- శనివారం రాత్రి 10 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం–న్యూఢిల్లీ(20805) ఏపీ ఎక్స్‌ప్రెస్ ఆదివారం తెల్లవారు 3 గంటలకు బయలుదేరింది.
- శనివారం రాత్రి 11.25 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం–లోకమాన్య తిలక్ టెర్మినస్(18519) ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ మధ్య రాత్రి 1 గంటకు బయలుదేరింది.

ఆనందోత్సాహాలతో ‘భోగి’



అక్కిరెడ్డిపాలెంలో గ్రామస్తులు వేసిన భోగి మంటలు

గాజువాక: మంచుతెరల మాటున సూరీడు ఉదయించక ముందే గాజువాకలో భోగి సందడి మొదలైంది. చీకట్లను తరిమివేసేలా.. గిలిగింతలు పెట్టే చలిని దూరం చేసి వెచ్చదనాన్నిస్తూ.. శనివారం తెల్లవారుజాము మూడున్నర గంటల నుంచి కాలనీల్లో భోగి మంటల వెలుగులు ప్రకాశించాయి. నలుగు పిండితో స్నానాలను ఆచరించి, భోగి మంటలు వేసి వాటి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. చిన్నపిల్లలు, యువకులు, మహిళలు భోగి మంటల వద్ద పూజలు చేశారు. అనంతరం గోమయంతో చేసిన చిన్న పిడకలను మంటల్లో వేశారు. ఆ బూడిదను తీసి నుదుటన అలంకరించుకుని భక్తి పారవశ్యంతో పొంగిపోయారు. మరోవైపు భోగి సందర్భంగా వేంకటేశ్వరుడి ఆలయానికి తరలి వెళ్లి, గోదా కల్యాణాన్ని కనులారా వీక్షించారు. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణంతో పాటు భక్తి గీతాలు ఆలపించారు.



గాజువాకలో భోగి మంటల వద్ద చిన్నారుల సందడి

చిన్నారుల సందడి

అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం రామాలయం ఎదురుగా భారీ భోగి మంటను వేశారు. శనివారం అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత గ్రామంలో యువకులు పెద్దపెద్ద చెట్ల మానులు, పాత కర్ర చెక్కలు, ఇతర కలప వస్తువులు, కర్రలు గుట్టలుగా పోసి భోగి మంటలను రాజేశారు. మంట చుట్టూ చలిని కాసుకుంటూ వెచ్చదనాన్ని ఆస్వాదించారు. ప్రతీ సందులో చిన్నచిన్న భోగి మంటలను వెలిగించారు.

పెదగంట్యాడ: మండలంలో భోగి పండగను శనివారం ఘనంగా జరుపుకొన్నారు. వేకువజామునే పిల్లలు, పెద్దలు భోగి మంటలు వేసి సంబరాలు చేశారు.



సత్యసాయి మందిరంలో బాలలకు భోగి పండ్లు

చిన్నారులకు భోగి పళ్లు

ఉక్కునగరం: భోగి పండుగ సందర్భంగా ఉక్కునగరంలోని పలు వీధుల్లో రంగవల్లులు వేసి, గొబ్బెమ్మలు ఏర్పాటు చేశారు. ఉక్కునగరం సత్యసాయి సమితి ఆధ్వర్యంలో వేకువజామున నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం మందిరంలో సుప్రభాత సేవ, అష్టోత్తర పూజలు చేశారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. మందిరంలో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా గోదా కల్యాణం



ప్రసన్నగిరిపై కల్యాణ మహోత్సవంలో మాంగల్యధారణ ఘట్టం



ప్రసన్నగిరిపై వేడుకను వీక్షించేందుకు హాజరైన భక్తులు

అక్కిరెడ్డిపాలెం: గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా జరిపించారు. ధనుర్మాసం ఆఖరి రోజు, భోగి పండగ వేళ వేంకటేశ్వరస్వామి ఆలయాలన్నీ కల్యాణ కాంతులతో దేదీప్యమానంగా దర్శనమిచ్చాయి.
- బీహెచ్‌పీవీ కూడలిలోని ప్రసన్న గిరిపై కొలువైన ప్రసన్న వేంకటేశ్వరాలయంలో జరిపించిన కల్యాణ వేడుకలో 40 జంటలు పాల్గొన్నాయి. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నారాయణాచార్యులు, పాలకమండలి చైర్మన్ గంప్రెడ్డి రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో..

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ముగింపు సందర్భంగా ప్రత్యేక అర్చనలు చేశారు. భోగి మంటలు వేశారు. తిరుప్పావైలో 30వ పాశురం పఠించారు. అనంతరం గోదాదేవి కల్యాణాన్ని ఆలయ కమిటీ వ్యవస్థాపకులు ఈ.కె.చారి దంపతులతో వేదపండితులు జరిపించారు.



శాంతినగర్ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

సందడిగా సంక్రాంతి

భగభగ భోగిమంటలు.. గణగణ గంగిరెద్దుల సందడి.. అందాల రంగవల్లికలతో ముచ్చటగా ఉన్న ప్రాంగణం .. కట్టెల పొయ్యిపై సంక్రాంతి ప్రత్యేక వంటకం పొంగల్ తయారీ.. చిన్నారులకు భోగిపళ్ల ఉత్సవం ..అతివల కోలాట ప్రదర్శనలతో అక్కిరెడ్డిపాలెం రామాలయం ప్రాంతం పల్లెల్లో సంక్రాంతిని తలపించింది. సీపీఎం, ఐద్వా, గ్రామస్తులు సంయుక్తంగా గ్రామంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. మహిళలు ముందుగా సంక్రాంతి ప్రత్యేకమైన పొంగల్‌ను చెరకు గడల మధ్య కర్రలపొయ్యి మీద తయారు చేసి గ్రామస్తులకు పంచారు. అక్కిరెడ్డిపాలేనికి చెందిన శ్రీ లక్ష్మీ నర్సింహ బృందం కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. చిన్నారులకు మహిళలు భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, సీపీఎం, ఐద్వా నాయకులు పాల్గొన్నారు. - అక్కిరెడ్డిపాలెం





నేత్రపర్వం.. మకరజ్యోతి దర్శనం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద మకరజ్యోతిని మాలధారులు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. మకర జ్యోతి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉక్కునగరం అయ్యప్ప ఆలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అష్టాభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయంలో 18 మెట్లకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామికి సంధ్యా హారతి పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో పడి మెట్ల వద్ద దీపాలు వెలిగించి, చివరి మెట్టు ధ్వజ స్తంభం వద్ద సాయంత్రం 6.45 గంటలకు మకర జ్యోతి దర్శనం కల్పించారు. అయ్యప్ప మాలధారులతో పాటు సాధారణ భక్తులు కూడా జ్యోతిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



విశేషాలంకరణలో అయ్యప్పస్వామి



జ్యోతి దర్శనం కోసం వచ్చిన భక్తులు

భోగి మంటల వద్ద ఉక్కు రక్షణ గళం



భోగిమంటల వద్ద నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

గాజువాక: భోగి మంటల వద్ద విశాఖ ఉక్కు పరిరక్షణ నినాదం ఎగసిపడింది. ఆంధ్రుల హక్కుపై కేంద్రం దుశ్చర్యపై నిరసన జ్వాలలు ప్రజ్వరిల్లాయి. విశాఖ స్టీల్ పరిరక్షణ కమిటీ పిలుపు మేరకు గాజువాకలో పలుచోట్ల భోగి మంటల వద్ద బ్యానర్లు, ప్లకార్డులను ప్రదర్శిస్తూ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని నినదించారు. స్టీల్‌ప్లాంట్‌తో పాటు ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం భోగిమంటల వద్ద నినాదాలు చేశారు. స్వతంత్రనగర్, దుర్గానగర్, దశమికొండ, రామచంద్రనగర్, అక్కిరెడ్డిపాలెం, అప్పన్న కాలనీలలో సీపీఎం నాయకులు ప్లకార్డులు ప్రదర్శించి ప్రైవేటీకరణను నిరసించారు. నాయకులు ఎం.రాంబాబు, ఎ.లోకేష్, డి.రమణ, పి.నర్సింగరావు, కె.నాగేశ్వరరావు, జి.లక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



అక్కిరెడ్డిపాలెంలో ప్రతీ ఇంటి నుంచి ఒక కర్రను తెచ్చి వేస్తున్న నిరసనకారులు

68వ వార్డులో సీఐటీయూ ఆధ్వర్యంలో..

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్‌ను అమ్మరాదంటూ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో భోగి సందర్భంగా గ్రామ ప్రజలు ప్రతీ ఇంటి నుంచి ఒక కర్రను భోగి మంటలో వేసి తమ నిరసనను తెలిపారు. శనివారం జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ జోన్ కార్యదర్శి ఎ.నూకేశ్వరరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో దాసరి అప్పారావు, ఎ.లోకేష్, వి.అప్పలరాజు, జె.కోటేశ్వరరావు, ఐద్వా ప్రతినిధులు జె.శ్రీలక్ష్మి, డి.రమణమ్మ, డి.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

‘స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేస్తే సహించం’



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రగతి పథంలో నడుస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను కావాలనే నిర్వీర్యం చేస్తున్నారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాంట్ జోలికోస్తే సహించేది లేదని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 702వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని ఎల్‌ఎంఎంఎం మరియు ఎస్‌బీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు. పోరాట కమిటీ నాయకులు డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ గతేడాది కరోనా సమయంలో 28వేల కోట్లు టర్నోవర్ చేసిన సంస్థను ఈ ఏడాది ముడి సరుకు అందించకుండా చేసి 1300 కోట్ల నష్టాల వైపు నెట్టారని విమర్శించారు. ఐక్య ఉద్యమాలతో ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామన్నారు. కార్యక్రమంలో వై.మస్తానప్ప, కె.భాస్కరరావు, సీహెచ్. సన్యాసినావు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అగనంపూడి స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతిభ



రాజస్థాన్‌లో స్కౌట్స్ అండ్ గైడ్స్

అగనంపూడి: అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ స్థాయి జంబోరీలో సత్తా చాటారు. ఈ నెల 1వ తేదీ నుంచి 13వ తేదీ వరకు రాజస్థాన్‌లో నిర్వహించిన 18వ జాతీయ జంబోరీలో నిర్వాహకుల మన్ననలు పొందినట్టు గైడ్ టీచర్ కృష్ణవేణి తెలిపారు. అగనంపూడి హైస్కూల్ నుంచి 17మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు.

మరో సైబర్ క్రైం

బాధితుడి ఖాతా నుంచి రూ. 1.62 లక్షలు మాయం

అల్లిపురం: అప్పు తీసుకుని పూర్తిగా తీర్చేసినా లోన్‌యాప్ ద్వారా సదరు వ్యక్తిని దోచుకున్న మరో ఘటన విశాఖలో చోటు చేసుకుంది. సైబర్ క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలో ఆరిలోవ ప్రాంతానికి చెందిన వ్యక్తి సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. వ్యక్తిగత అవసరాల నిమిత్తం పెకిఫర్ లోన్ యాప్ నుంచి డబ్బు తీసుకున్నాడు. కాలపరిమితిలోగా ఆ అప్పును తీర్చేసాడు కూడా. అయినప్పటికీ ఆ కంపెనీ నుంచి ముకేష్ అనే వ్యక్తి ఫోన్ చేసి డిసెంబర్ ఈఎంఐ బ్యాలెన్స్ వుందని.. డబ్బు కట్టాలని చెప్పాడు. తాను ఇది వరకే ఈఎంఐ చెల్లించానని సదరు వ్యక్తి చెప్పాడు. మీరు చెల్లించింది అప్‌డేట్ కాలేదని, ఫోన్ పేలోకి వెళ్లి యూపీఐ నంబర్‌కి తాము చెప్పిన కోడ్ ఎంటర్ చేయమని లోన్‌యాప్ వ్యక్తి తెలిపాడు. దీంతో బాధితుడు అతను చెప్పిన నంబరు ఎంటర్ చేశాడు. అంతే.. బాధితుడి అకౌంట్ నుంచి రూ.1,62,821 మాయమైపోయాయి. దీంతో బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు.

అప్రమత్తంగా ఉండండి..

లోన్ యాప్ ఆగడాలు తగ్గినట్లు తగ్గి మళ్ళీ విజృంభిస్తున్నందున ఎవరూ ఆన్‌లైన్ లోన్లు తీసుకోవద్దని సైబర్ క్రైం సీఐ భవానీప్రసాద్ తెలిపారు. సైబర్ నేరగాళ్లని నమ్మి మోసపోవద్దన్నారు. అలా ఎవరైనా సైబర్ నేరగాళ్ళ బారిన పడినట్లు అయితే తక్షణమే www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. లేదా టోల్ ఫ్రీ నంబర్ 1930లో గాని సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌కు 9490617917 నంబర్‌లో గానీ ఫిర్యాదు చేయాలని తెలిపారు.









